ఆదిలాబాద్-మంచిర్యాల



నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

♦ నిర్మల్ ♦ కొమురంభీం ఆసిఫాబాద్



సోమవారం 13 మే, 2024,
పేజీలు 06


# పోలింగ్‌కు సర్వం సిద్ధం

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్**

**మంచిర్యాల ప్రతినిధి,మే12, సూర్య మేజర్ న్యూస్ :** లోకసభ ఎన్నికలు-2024లో భాగంగా 002-పెద్దపల్లి (ఎస్.సి.) పార్లమెంట్ నియోజకర్గ పరిధిలోని జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13న జరుగునున్న పోలింగ్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లతో సిద్దంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను డి.సి.పి. అశోక్ కుమార్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి వి.రాములు, ఎ.సి.పి. ప్రకాష్తో కలిసి సందర్శించి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లోక్సభ ఎన్నికలలో భాగంగా ఈ నెల 13న నిర్వహించనున్న పోలింగ్ కార్యక్రమం కొరకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తరువాయి....2లో



# అధికారులు,విధులను బాధ్యతగా నిర్వర్తించాలి

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా.**

**అదిలాబాద్ మే 12 సూర్య మేజర్ న్యూస్:** లోక సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఎన్నికలకు నియమించిన అధికారులు, వారికి కేటాయించిన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ రాజర్షి షా,అన్నారు.ఆదివారం బోథ్ మండల కేంద్రంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయ ఆవరణలో ఎన్నికల ఏర్పాట్లను బోథ్ నియోజక వర్గ ఎన్నికల అధికారి ఐటీడీఏ పీవో కుష్బూ గుప్తతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సోమవారం జరగబోయే పార్లమెంట్ ఎన్నికల కోసం గట్టి భద్రత, భారీ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషిన్ ఇవిఎం, లను తరలించడం జరుగుతుందని ఎన్నికల అధికారులు తెలిపారు.బోథ్ నియోజకవర్గానికి సంబంధించి సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బోథ్ మండల కేంద్రంలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో రిటర్నింగ్ అధికారి ఖుష్బు గుప్తాతో కలిసి ఎన్నికల విధుల్లోకి వెళుతున్న అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.బోథ్ నియోజకవర్గంలో 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఇప్పటికే అధికారులకు రూట్లలో కేటాయించడం జరిగిందన్నారు. సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటును వినియోగించుకోవాలని, ముఖ్యంగా యువత ఓటు హక్కును వినియోగించుకుని ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.






## పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంఘ్వాన్**

**నిర్మల్ ప్రతినిధి మే 12, సూర్య మేజర్ న్యూస్** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.ఆదివారం పోలింగ్ నిర్వహణకోసం సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ నిమిత్తం నిర్మల్, ముధోల్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పోలింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది సకాలంలో వారికా కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ సామాగ్రి పంపిణీ సరళిని పరిశీలించి, పోలింగ్ సామాగ్రిని తరలించే సమయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియ లో భాగంగా రాజకీయ పార్టీల సమక్షంలో ఉదయం 5.30 నిమిషాలకు మాక్ పోల్ నిర్వహించి, ఏడు గంటలకు పోలింగ్ ను ప్రారంభించాలన్నారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియను విజయంతం చేయాలని సూచించారు. పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతం పెంచాలని కోరారు. అనంతరం నిర్మల్ ఎన్ టి ఆర్ స్టేడియం లోని ఈ వి ఎం డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకులు జాద వార్ వివేకానంద్ తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో అదనపు పాలనాధికారి ఫైజాన్ అహ్మద్, బైంసా ఏ ఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్, ముధోల్ ఆర్డీవోలు రత్న కళ్యాణి, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# లోక్ సభ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

**ఆసిఫాబాద్ ప్రతినిధి/ కాగజ్‌నగర్, 12 మే సూర్య మేజర్ న్యూస్** లోక్ సభ ఎన్నికలలో భాగంగా 001-ఆదిలాబాద్ (ఎస్. టి.) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ (ఎస్. టి.) అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి ఆసిఫాబాద్ పట్టణంలోని పి. టి. జి. బాలుర గురుకుల పాఠశాల, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ కు సంబంధించి కాగజ్ నగర్ పట్టణంలోని సెయింట్ క్లారిటీ పాఠశాల లలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో జరుగుతున్న ప్రక్రియను ఎస్. పి. సురేష్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ సహాయ రిటర్నింగ్ అధికారి దీపక్ తివారి, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు లతో కలిసి పరిశీలించారు. తరువాయి...3లో



## లోక్ సభ ఎన్నికల పోలింగ్ కు సర్వం సిద్ధం

**- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**

మొదటి పేజీ తరువాయి...

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఆసిఫాబాద్ అసెంబ్లీ



సెగ్మెంట్ లో 356, సిర్పూర్ అసెంబ్లీ సెగ్మెంట్ లో 320 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా త్రాగునీరు,నీడ,ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, మూత్రశాలలు, ర్యాంపు సౌకర్యాలతో పాటు వేసవి దృష్ట్యా ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. పోలింగ్ రోజున గర్భిణులు, వయోవృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందని, జిల్లాలో 10 మహిళా పోలింగ్ కేంద్రాలు, 2 దివ్యాంగ పోలింగ్ కేంద్రాలు, 2 యువ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సమర్ధవంతంగా నిర్వహించేందుకు 20 శాతం అదనపు సిబ్బందిని కలుపుకుని మొత్తం 3వేల 244 మందిని నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 676 పోలింగ్ కేంద్రాలకు 91 రూట్లుగా విభజించి 91 మంది రూట్ అధికారులను నియమించడం జరిగిందని, 91 మంది సూక్ష్మ పరిశీలకులు, 91 మంది సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులతో పాటు ఎన్నికల నిర్వహణ కొరకు సెక్టార్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్,సి.సి.కెమెరాలను అనుసంధానం చేయడం జరిగిందని, రూట్లలో వెళ్లే ప్రతి వాహనానికి జి. పి. ఎస్. అమర్చడం జరిగిందని తెలిపారు.జిల్లాలో 55 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి, 61 ఇంటర్నెట్ సౌకర్యం లేని పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆయా పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చూస్తూ చేసుకోకుండా పోలీసు శాఖ సమన్వయంతో బందోబస్తు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో సి. ఆర్. పి. ఎఫ్., పారా మిలిటరీ బలగాలతో పాటు ప్రత్యేక పోలీసు విభాగం అధికారులు,సిబ్బంది,అటవీశాఖసిబ్బందిని విధులలో నియమించడం జరిగిందని తెలిపారు.జిల్లాలో 4 లక్షల 56 వేల 309 మంది ఓటర్లు ఉండగా ఇందులో 2 లక్షల 28 వేల 971 మంది మహిళలు, 2 లక్షల 27వేల310 మంది పురుషులు,28 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2లక్షల27 వేల 25 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1 లక్ష 14 వేల 404 మంది మహిళలు, 1లక్ష12వేల788 మంది పురుషులు,16 మంది ఇతరులు ఉన్నారని, సిర్పూర్ నియోజకవర్గంలో 2 లక్షల 29 వేల 101 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1లక్ష14వేల 567 మంది మహిళలు, 1 లక్ష 14 వేల 52 మంది పురుషులు,12 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు.ఈ నెల 13వ తేదీ పోలింగ్ రోజున ముందుగా మాక్ పోల్ నిర్వహించిన అనంతరం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతి 2 గంటలకు పోలింగ్ శాతాన్ని తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ కార్యక్రమంలో ఎలాంటి అంతరాయం లేకుండా అదనపు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచడం జరిగిందని, ఓటింగ్ యంత్రాల మార్పుపై అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగే విధంగా ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసే విజయవంతం చేయాలని తెలిపారు.



# ఎన్నికల నిర్వహణకు, వారే కీలకం..!


**ఆదిలాబాద్ మే 12 సూర్య మేజర్ న్యూస్,**

**ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ ఒక కీలకమైన అంశం. ఓటు హక్కుతో ప్రజలు తమకు నచ్చిన వ్యక్తిని ఎన్నుకునే ప్రక్రియ ఇది. ఓటు నమోదు మొదలుకుని పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు అధికార యంత్రాంగం సమన్వయంతో శ్రమించాల్సి ఉంటుంది. బీఎల్వో మొదలుకుని రిటర్నింగ్ అధికారి వరకు సక్రమంగా విధులు నిర్వహిస్తేనే ఎన్నికల ప్రక్రియ సజావుగా ముగుస్తుంది.లోక్సభ ఎన్నికలకు సంబంధించిన పనులు చివరి దశకు చేరాయి. అధికారులు, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నెల 13 న జరగనున్న ఎన్నికల ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసారు. ముఖ్యంగా అదిలాబాద్ లోక్సభ స్థానానికి 12 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు అధికార యంత్రాంగం ఎవరికి కేటాయించిన బాధ్యతలు వారు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఈ విషయమై అధికారులు,వారు నిర్వహించే విధులపై ప్రత్యేక కథనం..**



## రిటర్నింగ్ అధికారి..

లోకసభ ఎన్నికకు కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారు. నోటిఫికేషన్ విడుదల అయింది. మొదలుకొని నామపత్రాల స్వీకరణ, అధికారులకు విధుల కేటాయింపు, వారికి శిక్షణ ఇచ్చే కార్యక్ర మాలు పర్యవేక్షిస్తారు. ఈవీఎంల తరలింపు, కేటాయింపు, వివిధ పార్టీల ప్రజా ప్రతినిధులతో సమా వేశాలు తదితర పనులు చూస్తారు. నిత్యం సమావేశాల ద్వారా అధికారులకు దిశా నిర్దేశం చేస్తారు. ఓటరు జాబితా తయారీ నుంచి ఓట్ల లెక్కింపు వరకు ఆయనదే బాధ్యత ఉంటుంది.గ్రామస్థాయి అధికారి నుంచి జిల్లా స్థాయి అధికారి వరకు వివిధ దశల్లో ఆయా భూమికలను పోషిం చాల్సి ఉంటుంది.



## ఏఆర్వోలు..

ప్రతి నియోజకవర్గానికి ఒక సహాయ రిటర్నింగ్ అధి కారి (ఏఆర్వో) ఉంటారు. వీరిని ఎన్నికల సంఘం నియమిస్తుంది. వారి పరిధిలో ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు. ఓటరు జాబితా సరి చేయడం, ఓటర్ల చీటీల పంపిణీ పర్యవేక్షణ, పోలింగ్ శాతం పెంచేందుకు కార్యక్రమాల నిర్వహణపై ప్రధాన దృష్టి సారిస్తారు. రిటర్నింగ్ అధికారి నుంచి వచ్చిన ఆదేశాలను పక్కాగా ఆమలు చేస్తారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రి తరలింపు, నియోజకవర్గ కేంద్రాల్లో ఈవీఎంల భద్రతను పర్యవేక్షణ చేస్తారు. పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఆర్వోకు తెలియజేస్తారు.

## సెక్టోరియల్ అధికారి..

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యత సెక్టోరియల్ అధికారిపై ఉంటుంది. కేంద్రాల పరిధిలో ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్తు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా చూస్తారు. ఒక్కో సెక్టోరియల్ అధికారికి పది చొప్పున పోలింగ్ కేంద్రాలుంటాయి. పోలింగ్ కేంద్రంతో పాటు పరిసరాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలి. పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ శాతాన్ని పైస్థాయి అధికారికి చేరవేస్తారు.

## సూక్ష్మ పరిశీలకులు..

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సూక్ష్మ పరిశీల కులు (మైక్రో అబ్జర్వర్) ఉంటారు. పోలింగ్ రోజు ఉదయం ఈవీఎం పనితీరును పర్యవేక్షిస్తారు. పోలింగ్ను పర్యవేక్షిస్తారు. ఓటింగు ఎలాంటి ఆటంకం తలెత్తకుండా చూస్తారు. ఇప్పటికే ఈ విషయమై ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా దశల వారీగా వీరికి శిక్షణలు సైతం పూర్తి చేశారు.

## పీవోలు..

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. పోలింగ్కు అవసరమైన ఈవీ ఎంలు, ఇతర సామగ్రి తీసుకొస్తారు. ఆ కేంద్రం పూర్తి బాధ్యత ఆయనదే. ఓటింగ్ ముగిసిన తర్వాత యంత్రాలను బందోబస్తు మధ్యన స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. వీరికి సహాయంగా అద నపు ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. వీరితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులు ఉంటారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి వారు పని చేయాల్సి ఉంటుంది. పోలింగ్ ప్రారంభ సమయా నికి ముందే ఈవీఎంలు పని చేస్తున్నాయో లేదో పీవో చూడాల్సి ఉంటుంది.

## బీఎల్వో లు

గ్రామ, నగరం, పట్టణ స్థాయిలో పనిచేసే వారే బీఎల్వో (బూత్ స్థాయి అధికారి)లు. అర్హులైన వారందరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడటంతో పాటు కొత్తవారి పేర్లు నమోదు చేయిస్తారు. ఇంటింటికి తిరిగి పోల్ చీటీలు అందిస్తారు. పోలింగ్ శాతం పెరిగేందుకు కరపత్రాలు, ఓటరు గైడ్ వంటివి పంపిణీ చేస్తారు. పోలింగ్ రోజు వారికి కేటాయించిన కేంద్రం వద్ద ఓటరు జాబితాతో కూర్చుంటారు. ఎవరికైనా పోల్చిటీలు రాకుంటే వెంటనే అందజేస్తారు.

# ఓటు వేసేందుకు ఈ గుర్తింపు కార్డులుంటే చాలు

**అదిలాబాద్ టౌన్,మే 12 సూర్య మేజర్ న్యూస్**



లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల, సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబి తాలో పేరున్న వారు ఓటు వేసే హక్కు ఉంది. అయితే జాబితాలో పేరున్న వ్యక్తిని తానేనని నిరూ పించుకోవాల్సి అందుకోసం ఉంటుంది. ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఓటరు గుర్తింపు కార్డు అంద జేస్తుంది. దానితో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేయొచ్చు. ఇది లేనివారు ప్రత్యా మ్నాయంగా వివిధ రకాల గుర్తింపు కార్డులు చూపించే వెసులుబాటు ఎన్నికల సంఘం కల్పించింది.పాస్ పోర్టు – డ్రైవింగ్ లైసెన్స్ – పాన్కార్డు ఆధార్కార్డు – బ్యాంకులు, తపాలా కార్యాలయాలు జారీచేసే పాసు పుస్తకం – ఉపాధి హామీ పథకం జాబ్కార్డు కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్టకార్డు – కార్మికశాఖ గుర్తింపు కార్డు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికా రిక గుర్తింపు కార్డు ఫొటోతో ఉన్న పింఛన్ పత్రం , కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డు దివ్యాంగుల గుర్తింపు కార్డులలో ఏదో ఒకటితో ఓటు వేయవచ్చును.

# పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- ప్రజలందరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి - రిటర్నింగ్ అధికారి రాజర్షి షా**



**అదిలాబాద్ మే 12 సూర్య మేజర్ న్యూస్**

పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రజలందరు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును సోమవారం వినియోగించుకోవాలని రిటర్నింగ్ అధికారి రాజర్షి షా.అన్నారు. ఆదివారం బోథ్ నియోజకవర్గంలోని ఎంఆర్‌వో కార్యాలయం,అదిలాబాద్ టీటీడిసిలో ఈవిఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను అదిలాబాద్,పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,జిల్లా కలెక్టర్ రాజర్షిషా సందర్శించి పరిశీలించారు. అంతకుముందు కలెక్టర్ తన స్వీయ పర్యవేక్షణలో కలెక్టరేట్ కార్యాలయం, టీటీడీసిలో స్ట్రాంగ్ రూంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ఓట్ల లెక్కింపు కేంద్రానికి తరలించారు.రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ రేపు పోలింగ్ డే ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఓటు పండగ లో అదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గం లోని 18 సంవత్సరాల పైబడి ఓటు హక్కును కలిగిన 16 లక్షల 52 వేల 148 మంది ఓటర్లందరూ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆన్నారు.మీరు ఈరోజు చేసే పని చాలా విలువైనదని , తమ ఓటు వినియోగించడం మన ప్రాథమిక బాధ్యత అని అన్నారు.నేను,ఎస్పి మా ఓటుని అదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి మార్చుకొని ఉపయోగించుకోబోతున్నామని,మీరు కూడా ఈ బాధ్యతలో పాలుపంచుకోవాలని,తమ ఓటు హక్కును వినియోగించుకొని మంచి ప్రభుత్వాన్ని మనం ఎన్నుకోవాలన్నారు.పోలింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని ,రేపటి వాతావరణం వర్షాలు పడే అవకాశం ఉందని,ఇప్పటివరకు పోలింగ్ సిబ్బందిని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి అన్ని వసతులు సమకూర్చి వారిని వారి పోలింగ్ స్టేషన్లకు పంపించడం జరిగిందని తెలిపారు.రేపు అదే విధంగా రిసెప్షన్ సెంటర్ లో కూడా పోలింగ్ స్టేషన్ నుంచి వచ్చే పోలింగ్ సిబ్బంది గాని మెటీరియల్ గాని తడిసిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని ప్రతి ఒక్క పోలింగ్ స్టేషన్లలో తీవ్ర ఎండల దృష్ట్యా ఓటర్లకు కుర్చీలు, షేడ్ షామియానాలు ఏర్పాటు, త్రాగునీరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ లో ఎలాంటి



అంతరాయం కలగకుండా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లో ,రిసెప్షన్ సెంటర్లో , 2200 పోలింగ్ స్టేషన్ల ప్రాంతాల్లో గాని ఎక్కడైనా విద్యుత్ నిలిపివేత జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.సమస్యాత్మక ప్రాంతాలలో సిఎపిఎఫ్ మెజర్స్ , నాన్ సీఏపీఎఫ్ మెజర్స్ తీసుకోవడం జరిగిందన్నారు.మొత్తం జిల్లాలో 2200 పోలింగ్ స్టేషన్లో సుమారుగా 10,560 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారని. 249 సెక్టార్ ఆఫీసర్లు,150 మైక్రో అబ్జర్వర్స్ సిఎపిఎఫ్ కంపెనీస్,పోలీసు బృందాలు కూడా కలుపుకొని సుమారుగా 12000 కు పైగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు అందరూ సహకరించి మన ఆదిలాబాద్ నియోజకవర్గ పార్లమెంటుకు జరగబోయే ఎన్నికలను విజయవంతం చేయాలని ఆన్నారు.ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుండి ఆదివారం పోలింగ్ బృందాలు ఈవీఎం లు, పోలింగ్ సామాగ్రితో ఆయా నియోజక వర్గాల లోని పోలింగ్ కేంద్రాలకు నిర్దేశించిన రూట్లలో తరలి వెళ్లారని కలెక్టర్ తెలిపారు.నేటి రాత్రికే పోలింగ్ కేంద్రాలలో సరిగ్గా వెలుతురూ ఉండేలా కంపార్ట్మెంట్, సీటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని ఏ చిన్న సంఘటనకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని అన్నారు . పోలింగ్ అనంతరం చెక్ లిస్ట్ ప్రకారం ఈవీఎం లను, ఇతర మెటీరియల్స్ ను రిసెప్షన్ కేంద్రాలలో అప్పగించాలని,వాటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచాలని అధికారులకు సూచించారు. ఓటింగ్ జరిగే రోజు సెలవు దినం కాదని మనందరి ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించే ఒక అపూర్వమైన రోజు అని ప్రతి ఒక్కరు గుర్తెరిగి బాధ్యతాయుతంగా వంద శాతం ఓటు వేసి తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని కోరారు. కలెక్టర్ వెంట పలువురు అధికారులు ఉన్నారు.



## బొట్టు పెట్టి హారతి పట్టి పూలతో ఎలక్షన్ సిబ్బందికి స్వాగతం

**- ఆకర్షణగా నిలిచిన దేవాపూర్ మహిళా పోలింగ్ స్టేషన్**
**- బెల్లంపల్లి ఏ ఆర్వో రాహుల్ చొరవతో 13వ పోలింగ్ స్టేషన్ కు ప్రత్యేక అలంకరణ**

**కాసిపేట,ఏప్రిల్ 12 సూర్య మేజర్ న్యూస్**

సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది సంబంధిత ప్రాంతాలకు చేరుకున్నారు.దేవాపూర్ లోని 13వ పోలింగ్ స్టేషన్ మహిళా పోలింగ్ స్టేషన్‌గా ప్రకటించారు. ఈ పోలింగ్ స్టేషన్ పరిధిలోని పంచాయతీ సిబ్బంది పంచాయతీ కార్యదర్శి కవిత ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి ఘన స్వాగతం పలికారు.బొట్టు పెట్టి హారతులు ఇచ్చి పూల బొకేలతో ప్రత్యేక స్వాగతం పలికి సిబ్బందిని సంతోషపెట్టారు. దింసా నృత్యం, సన్నాయి మేళ తాళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో సిబ్బంది దేవాపూర్ లోని పోలింగ్ స్టేషన్లో అన్నింటిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మేల తాళాలు తో పోలింగ్ సిబ్బందికి ఘన స్వాగతం పలకడంతో పాటు వారికి షర్బత్ అందించి ఉత్తమ పోలింగ్ నిర్వహించవలసిందిగా ఆహ్వానం పలికారు. చక్కటి ఏర్పాట్లను చూసిన పోలింగ్ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ఈ పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. దేవాపూర్ రెండవ సెక్టార్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ లలో సౌకర్యాలు చాలా చక్కగా ఏర్పాటు చేయడం పట్ల సెక్టార్ ఆఫీసర్ ఐనాల సైదులు సంతృప్తి వ్యక్తం చేశారు.



## పోలింగ్ సిబ్బందికి ఘన స్వాగతం

**కాసిపేట,ఏప్రిల్ 12 సూర్య మేజర్ న్యూస్**

కాసిపేట మండలంలోని లంబడి తండా (కె) గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరగబోయే




పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నిర్వహించే సిబ్బందికి ఘన స్వాగతం పలికిన అధికారులు. లంబడి తండాలోని 30 వ నంబర్ ఆదర్శ పోలింగ్ స్టేషన్ ను సోమవారం జరగబోయే ఎన్నికలకు సర్వం సిద్ధం చేశారు దీంట్లో భాగంగా ఆదివారం పోలింగ్ స్టేషన్ ను సుందరంగా చేశారు. పోలింగ్ నిర్వహించే సిబ్బందిని బ్యాండ్ వాయిద్యాలతో స్వాగతం పలికి వారికి పూల మాల వేసి స్టేషన్ కు ఆహ్వానించారు. కార్యక్రమంలో డి అర్ డి ఓ పిడి కిషన్,అర్ ఐ సులోచన, ఎంపీఓ నాగరాజు,పంచాయతీ కార్యదర్శులు కీర్తి, సురేష్ ,బి ఎల్ ఒ , డ్వాక్రా గ్రూపు మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

**- జిల్లా కేంద్రంలో ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ**




**ఆదిలాబాద్ మే 12 సూర్య మేజర్ న్యూస్**

లోక్సభ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, జిల్లా పూర్వ సమాచార శాఖ అధికారిని తిరుమల,డి వై ఎస్ వో, వెంకటేశ్వర్లు,కోరారు. జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ రాజర్షి షా,ఆదేశానుసారము అదిలాబాద్ పట్టణంలో స్వీప్ ఆధ్వర్యంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించి ప్రజలను ఓటు హక్కు వినియోగం పై చైతన్యపరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ సోమవారం రోజున జరగబోవు పార్లమెంటు ఎన్నికల సమయం ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు వివిధ బూతులలో జరుపబడె ఎన్నికలకు తప్పకుండా తమ తమ ఓటు , తమరి పరివార ఓటును వినియోగించవలసిందిగా కోరారు. ఈ ర్యాలీ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల నుండి అశోక్ రోడ్ ,కోలిపుర, గాంధీ చౌక్ దుకాణదారులకు ,గుండా సాగుతూ ఇంటింటికి వెళ్లి ఓటు విలువ గురించి వివరించారు.జిల్లా కేంద్రానికి చెందిన వత్సల భాయి తొంబై ఆరు(96) సంవత్సరాల వృద్ధురాలు వారి ఇంటి వద్ద ఫ్రీడమ్ ఫైటర్ ప్రెసిడెంట్ రాంసింగ్ ,ఎక్స్ సర్వీస్ మెన్ ప్రెసిడెంట్ శంకర్ దాస్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమములో వివిధ ఎన్జీవో సభ్యులు,మెప్మా సిబ్బంది,డి.పి.ఆర్.ఓ యొక్క సంస్కృతిక కళాబృందం, అంగన్వాడి, యువజనులు క్రీడాకారులు ఈ ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో జిల్లా అధికారులు సవిత డి డబ్ల్యు ఓ, ప్రిన్సిపల్ అనిత, శ్రీనివాస్ డిఎం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



### పోలింగ్ వేళ ప్రతి అంశంలో

# అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



**ఆసిఫాబాద్ ప్రతినిధి 12 మే సూర్య మేజర్ న్యూస్**

లోక సభ ఎన్నికలలో భాగంగా 001-ఆదిలాబాద్ (ఎస్. టి.) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలో 001-సిర్పూర్, 005-ఆసిఫాబాద్ (ఎస్.టి.) అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13న జరగనున్న పోలింగ్ కార్యక్రమానికి సంబంధించి ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో పోలింగ్ నమోదు, సమాచారాన్ని సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేసే ప్రక్రియ పై కంప్యూటర్ ఆపరేటర్లు, అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కార్యక్రమంలో ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలని, పోలింగ్ శాతాన్ని సెక్టార్ అధికారుల వద్ద నుండి ప్రతి 2 గంటలకు నమోదైన ఓట్ల వివరాలు సేకరించాలని, నియోజకవర్గానికి ఒక జిల్లా స్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక ఆపరేటర్ 3/4 సెక్టార్ అధికారుల నుండి పోలింగ్ శాతాన్ని సేకరించాలని, పోలింగ్ రోజు ఉదయం 9 గంటలకు, 11 గంటలకు, మధ్యాహ్నం 1 గంటలకు, 3 గంటలకు, 4 గంటలకు వివరాలు సేకరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ఇన్చార్జులుగా వ్యవహరించే జిల్లా స్థాయి అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య అధికారి అనిల్ కుమార్, జిల్లా ఆడిట్ అధికారి, ఎన్నికల విభాగం తహసిల్దార్ మధుకర్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజ్, నాయబ్ తహసిల్దార్ జితేందర్, ఎన్. ఐ.సి. ఇంచార్జ్ శ్రీకాంత్, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యత

### -సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ కుభీర్ మండల చైర్మేన్ సాప పండరి

**కుభీర్,12మే,సూర్య మేజర్ న్యూస్**

నేడు జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కుబీర్ మండల సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్‌కోసం చైర్మన్ సాప పండరి అన్నారు.అంతేకాకుండా జీవుల మనుగడకు అక్సిజన్ ఎంత అవసరమో,ప్రజాస్వామ్య మనుగడకు ఓటు అంతే అవసరమన్నారు.కాబట్టి ప్రతి ఒక్కరూ భాధ్యతతో కుటుంబ సభ్యులతో,ఇరుగు పొరుగు వారితో కూడా ఓటు వేయించాలని సూచించారు.ప్రజాస్వామ్యవిలువలను పాటిస్తునే,భాధ్యతాయుతమైన పౌరుడిగా వుండాలని తెలిపారు.తీర్థయాత్రలు,పిక్నిక్ లు,ఫాంక్షన్స్ అనే వివిధ కార్యక్రమాలను వాయిదా వేసుకొని ఓటు వేసి 100% ఓటింగ్ శాతం అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.



# పిడుగుపాటుకు రైతు మృతి

### - ఐదుగురికి గాయాలు

**ఆదిలాబాద్ మే 12 సూర్య మేజర్ న్యూస్.**



ఈదురు గాలులు,ఉరుములు మెరుపులతో ఆదివారం కురిసిన అకాల వర్షానికి తోడు పిడుగు పడ్డ సంఘటనలో ఒక రైతు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మ గ్రామంలో గాలి వాన బీభత్సంతో అకాల వర్షం కురిసింది. పంట చేనులో పిడుగు పడడంతో అదే గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ (29) అక్కడికక్కడే మృతి చెందగా, మరో అయిదురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెల్సుకున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్ గాయపడ్డ భోజన్న నాగో రావు , టిల్లు అనే వ్యక్తులను పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

### ఘనంగా అమ్మవారికి

## బోనాలు సమర్పించిన మహిళలు



**లోకేశ్వరం,మే 12,సూర్య మేజర్ న్యూస్**

లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కాండ్లీ గ్రామంలో ఆదివారం పర్వదినం సందర్భంగా గ్రామ మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ అమ్మవారి కరుణ వల్ల వర్షాలు బాగా కురిసి,పంటలు బాగా పండాలని కోరుకున్నామని తెలిపారు.అదేవిధంగా గ్రామస్తులంతా ఏకమై గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,గ్రామ పెద్దలు,మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పశువులను గోశాలకు తరలించాలి ... ఖానాపూర్ ప్రజల డిమాండ్

**ఖానాపూర్ రూరల్ మే 12 సూర్య మేజర్ న్యూస్**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో పశువులు రోడ్లపై తిరుగుతూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ప్రమాదాలకు కారణమవుతున్నాయని పలువురు అంటున్నారు. ప్రమాదాలకు కారణమవుతున్న పశువులను తక్షణమే గోశాలకు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నరు అమాయక మూగజీవులు బయట ప్లాస్టిక్ కవర్లలో పారవేసిన వ్యర్థపదార్థాలను ప్లాస్టిక్ కవర్ తో సహా తిని మృత్యువాత పడుతున్నాయని అన్నారు. పెంపకం దారులు పశువులను పోషించకుండా రోడ్డుమీద వదిలి పెడుతున్నారని దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు, పశువులకు మృతి ఘోష ఏర్పడుతుందని అన్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ వారు స్పందించి తక్షణమే పశువులను గోశాలకు తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## అమ్మకు ప్రేమతో... ఆంజనేయులు సేవా కార్యక్రమాలు

### - మా అమ్మానాన్న ఫౌండేషన్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు

**లోకేశ్వరం,మే 12 సూర్య మేజర్ న్యూస్**

లోకేశ్వరం మండలం ధర్మోర గ్రామానికి చెందిన ఎం .ఆంజనేయులు ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలను కొనసాగిస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు. ఆంజనేయులు నాన్న గారు తన చిన్నతనంలోనే అనారోగ్యంతో కాలం చేశారు.వారి తల్లి గారైన గంగుబాయి ఆర్థిక సమస్యలను అధిగమిస్తూ పిల్లలను కష్టపడి చదివించారు.తన తల్లి పడుతున్న కష్టాన్ని చూసి ఆంజనేయులు ఇంటర్ వరకు తన విద్యాభ్యాసాన్ని పూర్తిచేసి తన స్వగ్రామంలోని ఆర్ఎంపి వైద్యునిగా సేవలందించడం ప్రారంభించారు. అదే సమయంలో తన తల్లిదండ్రుల పైన ఉన్న ప్రేమతో "మా-అమ్మానాన్న ఫౌండేషన్" స్థాపించి ఆర్థికంగా సరైన వైద్యం చేయించుకోలేని పేదల పరిస్థితిని చూసి చలించిపోయేవారు.అంతేకాకుండా నిర్మల్,బైంసా పట్టణాలలో ఉన్న వైద్యులను సంప్రదించి వారి ద్వారా లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసేవారు.ఇప్పటివరకు సుమారు 3000 నుండి 4000 మంది నిరుపేదలకు అభాగ్యులకు తన ఫౌండేషన్ ద్వారా దుస్తులను పంపిణీ చేశారు. అంతేకాకుండా ఆహారం దొరకక అలమటించిపోయే అభాగ్యుల పరిస్థితిని చూసి "భైంసా ఫుడ్ బ్యాంక్ ను ప్రారంభించారు.తన ఫుడ్ బ్యాంక్ ద్వారా ఇప్పటివరకు 19 మంది నిరుపేదలకు అభాగ్యుల వద్దకు తన వాహనంలో స్వయంగా వెళ్లి వారికి అన్నప్రసాదాలను అందజేశారు.ఆయన చేస్తున్న పలు సామాజిక సేవలను గుర్తించిన ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ ఆయనను "తెలంగాణ రత్న" అవార్డుతో సత్కరించారు.

### చేపట్టిన సేవా కార్యక్రమాలు....

లోకేశ్వరం మండలంలోని ప్రతి గ్రామాలలో తిరిగి యువతకు







పొగాకు సేవించడం, మద్యపానం సేవించడం వంటి దురాలవాట్లపై అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బైంసా ఫుడ్ బ్యాంక్ ద్వారా 19 వేల మంది నిరుపేదలకు,అభాగ్యులకు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తన గ్రామంలోని రైతుల సహాయంతో తన పొలంలో పండించిన వరి గడ్డి కట్టలను ప్రతి సంవత్సరం నిర్మల్, బైంసా పట్టణాలలో కొనసాగుతున్న గో సంరక్షణ కేంద్రాలకు పంపిణీ చేశారు.వార్షిక పరీక్షలకు హాజరయ్యే 10వ తరగతి విద్యార్థులను లోకేశ్వరం బస్టాండ్ నుండి తన సొంత వాహనంలో ఉచితంగా పరీక్ష కేంద్రాలలో విడిచి పెట్టేవారు. అత్యవసర సమయంలో రక్తం అందక బాధపడుతున్న రోగుల పరిస్థితిని చూసి తానే స్వయంగా రక్తనిధి కేంద్రాలకు వెళ్లి రక్తదానం చేసేవారు.పలు సందర్భాలలో అకాల మరణం పొందిన కుటుంబాలకు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు.వేసవిలో మూగజీవుల దాహార్తిని తీర్చేందుకుగాను నీటి తొట్టెలను ఏర్పాటు చేసి మూగజీవాల పట్ల తనకున్న ప్రేమను చాటారు.రోడ్డుపైన ఉన్న అభాగ్యులకు నిరుపేదలకు సుమారు 3000 నుంచి 4000 మందికి ఉచితంగా బట్టలను పంపిణీ చేశారు.





## ప్రస్తుతం అత్యంత కీలకమైన సమయం

### - జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్




**మంచిర్యాల,మే 12, సూర్య మేజర్ న్యూస్ :**

లోకసభ ఎన్నికలు-2024లో భాగంగా 002-పెద్దపల్లి (ఎస్.సి.) పార్లమెంట్ నియోజకర్గ పరిధిలోని జిల్లాలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ నెల 13న జరుగునున్న పోలింగ్ నేపథ్యంలో ప్రస్తుతం అత్యంత కీలకమైన సమయమని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమీకృత కంట్రోల్ రూమ్ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ కలిసి సందర్శించి అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగనున్న లోక్సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రస్తుత సమయం అత్యంత కీలకమని, అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాటు చేసిన సి.సి. కెమెరాలు, వెబ్కాస్టింగ్లో అంతరాయం రాకుండా విద్యుత్ శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షిస్తూ ఉండాలని, నిరంతరాయంగా ఇంటర్నెట్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆదివారం సాయంత్రం 7 గం.ల నుండి ఈ నెల 14వ తేదీ మంగళవారం ఉదయం 7 గం.ల వరకు 36 గంటల పాటు విధుల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాలని, వర్షాభావ పరిస్థితులు, గాలుల కారణంగా పోలింగ్ నిర్వహణలో తలెత్తే ఇబ్బందులు అధిగమించే విధంగా అధికారులు ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో పని చేయని సి.సి. కెమెరాలను గుర్తించి సంబంధిత పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారులను సంప్రదించి తిరిగి పని చేసేలా పర్యవేక్షించాలని, పోలింగ్ నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, ఎన్నికల తహశిల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం అధికారులు, సమీకృత కంట్రోల్ రూమ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు బోనం సమర్పణ

### - బోనమెత్తిన కాండ్లీ గ్రామ మహిళలు

**లోకేశ్వరం,మే 12, సూర్య మేజర్ న్యూస్**

ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించిన మాహిళలు... లోకేశ్వరం మండలంలోని రాయపూర్ కా%శీ%డ్లీ గ్రామంలో అమ్మవారికి బోనాల సమర్పించారు వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్తులంతా ఏకమై గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గ్రామ పెద్దలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలకు సర్వం సిద్ధం

### - అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి - ఎన్నికల సామాగ్రి కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ






**ముధోల్, మే12,సూర్య మేజర్ న్యూస్**

లోక్‌సభ ఎన్ని కల్లో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని సిద్ధమయ్యాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల సూచించారు. ఆదివారం ముధోల్ నియోజకవర్గ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సోమవారం జరిగే లోక్ సభ ఎన్నికలకు 311 పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర రాష్ట్ర పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పొలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. నియోజకవర్గంలో21 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్లు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు.

## విశ్వజ్ఞాని ఆది శంకరాచార్య జయంతి ఉత్సవాలు

**మందమర్రి టౌన్, మే 12, సూర్య మేజర్ న్యూస్.**

అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన విశ్వజ్ఞాని జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను మందమర్రి పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి బీమోజు కుశకుమార్ ఆచారి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యహ వాచనం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. జగద్గురు ఆదిశంకరాచార్య చిత్రపటానికి నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణులు, ఆలయ కమిటీ సభ్యులు ఆకునూరి లక్ష్మీ నారాయణ, కటుకోజ్వల వేణు, నూతి తిరుపతి, గుగ్గిళ్ల రవీంద్ర చారి, వలబోజు రాజవీరు, కొండపాక శ్రీనివాస్, బోనాల శ్రీనివాస్, ఇనుగుర్తు రాజమొగిలి, శ్రీపాద వెంకటేశ్వర్లు, దేవరకొండ రాజేందర్, వలబోజు కిషోర్, మొగులోజు సాయి, కందుకూరి రమణా చారి, అబ్బోజు నాగరాజు, హరీష్ తదితరులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.



## పోలింగ్ కు సర్వం సిద్ధం

### - ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి - తహశీల్దార్ చంద్రశేఖర్

**మందమర్రి టౌన్, మే 12, సూర్య మేజర్ న్యూస్.**



పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మందమర్రి మండలంలో సోమవారం జరగనున్న లోకసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మండల తహశీల్దార్ చంద్రశేఖర్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మందమర్రి మండలంలో పురుషులు ఓట్లు 39,234, స్త్రీలు 39,814, థర్డ్ జెండర్లు 4 గురు, మొత్తంగా 79052 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 90 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 42 పోలింగ్ స్టేషన్లు, క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో 35 పోలింగ్ స్టేషన్లు, మందమర్రి మండల పరిధిలో 13 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని తెలిపారు. అదేవిధంగా మండలం వ్యాప్తంగా 43 పోలింగ్ లొకేషన్లు కలవని తెలిపారు. అదేవిధంగా మందమర్రి పట్టణంలోని పాలచెట్టు సింగరేణి మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ స్టేషన్ నెంబర్ 40 ను మోడల్ పోలింగ్ స్టేషన్ గాఏర్పాటు చేయగా, మహిళల పోలింగ్ స్టేషన్ గా మందమర్రి పట్టణంలోని సిఈఆర్ క్లబ్ లోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 31ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎండలు అధికంగా ఉన్నందున పోలింగ్ కేంద్రాల్లో షా మియానా, టెంట్లు, త్రాగునీరు, వైద్య సిబ్బంది, వృద్ధులకు దివ్యాంగ ఓటర్ల కోసం వీల్ చైర్లు, వాలంటీర్లను ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్ సూచించారు.

## కార్మికులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చెయ్యాలి

### - ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్

**మందమర్రి టౌన్, మే 12, సూర్య మేజర్ న్యూస్.**



సోమవారం జరగనున్న లోకసభ ఎన్నికలో దృష్ట్యా ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 222 ప్రకారం జిల్లాలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న సంఘటిత, అసంఘటిత రంగంలోని అన్ని షిఫ్టుల్లో పని చేసే కార్మికులకు పూర్తి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని, ఓటు శాతం పెరిగేలా కార్మికులంతా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు యాజమాన్యాలు అవకాశం కల్పించాలని ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్ ఆదివారం ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా 116 (ఇ) 01-05-2024 తారీకు ప్రకారం గెజిట్ నెం107లో కూడా కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న లక్షలాదిమంది కార్మికులకు పోలింగ్ రోజైన సోమవారం సెలవు దినం ప్రకటించకపోతే తమ అమూల్యమైన ఓటును వినియోగించుకోలేకపోతారని తెలిపారు. కార్మికులకు వారి పని ప్రదేశంలో కాకుండా వారు స్వంత గ్రామంలో ఓటు హక్కు ఉందని, దూర ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలస వచ్చి, పని చేసుకుంటున్న గ్రామీణ ప్రాంత కార్మికులు తమ గ్రామాల్లో ఓటు వేయలేక, ఓటు హక్కును కోల్పోతున్నారన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చినట్లే పార్లమెంట్ ఎన్నికల రోజున కూడా వేతనంతో కూడిన పూర్తి సెలవు దినంగా ప్రకటించే విధంగా యాజమాన్యాలకు జిల్లా అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేయాలని వారు కోరారు.